సాక్షి తిరుపతి

ఆదివారం । 7 । ఏప్రిల్ । 2024

I



గడప గడపలో సంక్షేమ వెలుగులు

తిరుపతి నగరంలోని 33, 35వ డివిజన్లతో ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి శనివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. - IIలో



వైఎస్సార్‌సీపీలోకి వలసల వెల్లువ

శ్రీకాళహస్తిలో సుమారు 200 మంది నేతలు, కార్యకర్తలు వైఎస్సార్‌సీపీలో శనివారం చేరారు. - IIలో



న్యూస్‌రీల్

ఎన్నికల యాప్‌లపై అవగాహన



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రవీణ్‌కుమార్

తిరుపతి అర్బన్ : ఎన్నికల యాప్‌లపై అవగాహన పెంపొందించుకోవాలని కలెక్టర్ ప్రవీణ్‌కుమార్ ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లో జేసీ ధ్యానచంద్రతో కలసి సువిధ, ఎన్‌కోర్, సీ విజిల్, ఈఎస్‌ఎంఎస్, ఈటీపీబీపీఎస్ యాప్‌లపై సంబంధిత నోడల్ అధికారులకు శిక్షణ ఇచ్చారు. కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ వారు యాప్‌లు రూపొందించి సులభతరంగా ఎన్నికల నిర్వహణ, పర్మిషన్ల మంజూరు, పర్యవేక్షణ కోసం అందుబాటులో ఉంచారని తెలిపారు. ఆయా యాప్‌లపై సంబంధిత నోడల్ అధికారులకు పూర్తి అవగాహన ఉండాలని సూచించారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ పెంచల కిషోర్, ఏఎస్పీలు రాజేంద్ర, వెంకటేశ్వర్లు, ఎస్‌బీసీ అడిషనల్ డీఐఓ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

29 నుంచి సమ్మర్ హాబీ క్యాంప్



శ్రీనివాస నెహ్రూ, ప్రాజెక్టు కోఆర్డినేటర్

తిరుపతి(అలిపిరి): తిరుపతి సైన్స్ సెంటర్‌లో ఈనెల 29 నుంచి జూన్ 8వ తేదీ వరకు 'సమ్మర్ హాబీ క్యాంప్' నిర్వహించనున్నట్లు ప్రాజెక్టు కోఆర్డినేటర్ శ్రీనివాస నెహ్రూ శనివారం తెలిపారు. రిజిస్ట్రేషన్లు ప్రారంభించామని.. సమ్మర్ క్యాంప్‌లో ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయో సైన్సు, ఎలక్ట్రానిక్స్, ఆస్ట్రానమీ, రోబోటిక్స్ సబ్జెక్టులు ఉంటాయని పేర్కొన్నారు. 6 నుంచి 10వ తరగతి విద్యార్థులు ఈ క్యాంపును సద్వినియోగం చేసుకోవచ్చని.. సబ్జెక్టుకు రూ.1000 చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. ఏప్రిల్ 25వ తేదీ లోపు వివరాలు నమోదు చేసుకోవాలని.. పూర్తి వివరాలకు 0877-2286202, 7989694681ను సంప్రదించాలని కోరారు.



వచ్చారు.. వెళ్లారు!

- సొంత ప్రయోజనాలే అజెండా
- ఎమ్మెల్యేలు ఆదిమూలం, ఆరణి శ్రీనివాసులు, మరి కొందరు మాజీలు
- 2019 ఎన్నికల తర్వాత టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలోకి
- ఐదేళ్లు పదవులు అనుభవించి తిరిగి సొంత గూటిలోకి
- అక్రమ సంపాదనలకు అలవాటు పడిన వారే అధికం

సాక్షి, తిరుపతి : పదవులు కోసం కొందరు.. అక్రమ ఆస్తులకు కాపాడుకునేందుకు మరి కొందరు.. అధికారం అడ్డుపెట్టుకుని అడ్డదిడ్డంగా సంపాదించుకోవాలని ఇంకొందరు పార్టీలు మారుతున్నారు. ప్రస్తుతం వైఎస్సార్‌సీపీ నుంచి టీడీపీ, జనసేనలో చేరుతున్న వారంతా గతంలో చంద్రబాబు అనుచరులే. సత్యవేడు ఎమ్మెల్యే ఆదిమూలం సైతం తెలుగుదేశం పార్టీ నుంచి వైఎస్సార్‌సీపీలోకి వచ్చిన వారే. 2001లో నారాయణవనం నుంచి టీడీపీ తరుపున జెడ్పీటీసీ స్థానానికి బరిలో దిగారు. 2009 సార్వత్రిక ఎన్నికల్లో సత్యవేడు నుంచి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేసి ఓడిపోయారు. 2014లో చంద్రబాబు మొండిచేయి చూపడంతో వైఎస్సార్‌సీపీలో చేరి ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేసి ఓటమి పాలయ్యారు. అయినప్పటికీ వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి 2019లో మళ్లీ ఆదిమూలానికే టికెట్ ఇచ్చి గెలిపించారు. ఆదిమూలం లాంటి వ్యక్తి ఎమ్మెల్యే అయ్యారంటే కేవలం వైఎస్ జగన్ ప్రభంజనమే కారణం అని స్థానికులు స్పష్టం చేస్తున్నారు. అయితే ప్రజలకు సేవ చేయడంలో ఎమ్మెల్యేగా ఆదిమూలం విఫలమయ్యారు. జనంలోనూ, వైఎస్సార్‌సీపీ శ్రేణుల్లో తీవ్రమైన వ్యతిరేకత మూటగట్టుకున్నారు. అయినప్పటికీ వైఎస్ జగన్ ఆయనకు తిరుపతి పార్లమెంట్ అభ్యర్థిగా అవకాశమిచ్చారు. ఎంపీ అభ్యర్థిగా బరిలో దిగేందుకు ఆసక్తి చూపని ఆదిమూలం.. వెంటనే తల్లి లాంటి వైఎస్సార్‌సీపీపై విమర్శలు చేసి నారా లోకేష్‌ని కలిశారు. వైఎస్సార్‌సీపీకి, ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయకపోయినా.. చంద్రబాబు సత్యవేడు టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా ఆదిమూలాన్ని ప్రకటించారు.

నైతిక విలువలు ఉండవు.. కేవలం స్వార్థ ప్రయోజనాలే ఉంటాయి. ఒక పార్టీ అనే నియమం ఉండదు.. పదవి కోసం ఎన్నిసార్లు అయినా కండువాలు మార్చేస్తారు. ఎప్పుడు ఎవరు అధికారంలోకి వస్తే వెంటనే వారి పంచన చేరిపోతారు. తమ అవసరాలు పూర్తికాగానే మరొకరి నీడలోకి వెళ్లిపోతారు. అక్రమ సంపాదనే వారి లక్ష్యం.. ఆస్తులను కాపాడుకునేందుకు ఎంతకైనా దిగజారిపోతారు. రాబోయే సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఇలాంటి మేకవన్నె పులులు యథేచ్ఛగా గోడలు దూకేస్తున్నాయి. ఇన్నేళ్లు తమను మోసి.. భరించిన తల్లిలాంటి వైఎస్సార్‌సీపీని దొంగ దెబ్బతీసేందుకు యత్నిస్తున్నారు. గతంలో టీడీపీతో అంటకాగినవారే అధికంగా తిరిగి పచ్చ కండువా కప్పుకుంటున్నారు. మరికొందరు గ్లాస్ పార్టీలోకి వెళ్లి ప్రజాసేవ ముసుగులో దోపిడీ చేసేందుకు ఎమ్మెల్యే అభ్యర్థిగా బరిలో దిగుతున్నారు. ఇలాంటి నయవంచక నేతల వైఖరిపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఓటుతో బుద్ధి చెప్పేందుకు సన్నద్ధమవుతున్నారు.

పదవులు.. ఆర్థిక లావాదేవీల కోసమే..!

చిత్తూరు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు మొదట టీడీపీ మండల నాయకుడు. 1995లో యాదమరి జెడ్పీటీసీ సభ్యుడిగా పోటీ చేశారు, తర్వాత టీడీపీలో చిత్తూరు అభ్యర్థిత్వం కోసం ప్రయత్నించి భంగపడ్డారు. 2009 ఎన్నికలకు ముందు ప్రజారాజ్యంలో చేరి చిత్తూరులో పోటీ చేసి ఓటమి పాలయ్యారు. 2012లో తిరిగి టీడీపీలో చేరి 2014లో చిత్తూరు టికెట్ ఆశించారు. టికెట్ ఇవ్వకపోవడంతో వెంటనే వైఎస్సార్‌సీపీలో చేరి 2014లో బరిలో దిగి ఓడిపోయారు. అయినప్పటికీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 2019లో టికెట్ ఇచ్చి చిత్తూరు ఎమ్మెల్యేగా గెలిపించారు. ఎమ్మెల్యే అయ్యాక చిత్తూరు ప్రజలను గాలికి వదిలేసి అపఖ్యాతి మూటగట్టుకున్నారు. అవినీతి అక్రమాల పాల్పడ్డారనే ఆరోపణలు సైతం ఉన్నాయి. దీంతో టికెట్ ఇచ్చినా ఓటమి ఖాయమని తేలడంతో అభ్యర్థిని మార్చాలని వైఎస్సార్‌సీపీ అధిష్టానం నిర్ణయం తీసుకుంది. అయినా ఆరణి శ్రీనివాసులకి పార్టీలో తగిన గుర్తింపు ఇస్తామని హామీ ఇచ్చినా.. జనసేన కండువా కప్పుకుని తిరుపతి అభ్యర్థిగా బరిలోకి దిగారు.

బాబు జమానాలో అవినీతికి అలవాటు పడిన నేతలు

చంద్రబాబు హయాంలో అవినీతి అక్రమాలకు అలవాటు పడిన నేతలు ఏ పార్టీ అధికారంలోకి వస్తే అందులోకి వెళ్లిపోతుంటారు. అలాంటి ఘనులు చాలా మంది 2019 తర్వాత అధికార వైఎస్సార్‌సీపీలోకి క్యూ కట్టారు. వద్దన్నా ఎమ్మెల్యే లేదా ఎంపీ, ఆయా జిల్లా అధ్యక్షుల ఆధ్వర్యంలో పార్టీలో చేరిపోయారు. తర్వాత అధికారాన్ని అడ్డుపెట్టుకుని ఇసుక, మట్టిని అక్రమంగా తవ్వి అమ్మి సొమ్ముచేసుకోవడం ప్రారంభించారు. ప్రభుత్వ భూములను సైతం ఆక్రమించుకుని రికార్డులు తారుమారు చేశారు. ఇలాంటి పాత పచ్చ నేతలు ఇప్పుడు తిరిగి టీడీపీ గూటికి చేరుకుంటున్నారు. అలాంటి వారిలో నియోజక వర్గ, మండల, గ్రామస్థాయి నేతలే అధికంగా ఉన్నారు. శ్రీకాళహస్తి నియోజక వర్గ పరిధిలోని శ్రీకాళహస్తి, ఏర్పేడు, తొట్టంబేడు జెడ్పీటీసీ సభ్యులతో పాటు మాజీ జెడ్పీటీసీ సభ్యుడు, మరి కొందరు ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు తిరిగి టీడీపీ కండువా కప్పుకున్నారు. టీడీపీ మాజీ కౌన్సిలర్ సుప్రజ 2019లో వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక తాను అధికారపార్టీ నాయకురాలిని అని చెప్పుకుంటూ మున్సిపల్ స్థలాన్ని లీజుకు తీసుకుని పక్కా భవనాలు నిర్మించి అద్దెకు ఇచ్చేసింది. అద్దె రూపంలో నెలనెలా రూ.1.50 లక్షలు స్వాహా చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. అదే విధంగా గూడూరు నియోజక వర్గ పరిధిలోని జెడ్పీటీసీ సభ్యుడు, మరో ముగ్గురు ఎంపీటీసీ సభయులు, సర్పంచ్‌లు, నాయుడుపేటకు చెందిన రాజశేఖరరెడ్డి, కట్టా వెంకరమణారెడ్డి, ఇలా చెప్పుకుంటూ పోతే కుప్పం, పలమనేరు, గంగాధరనెల్లూరు, చిత్తూరు, నగరి, చంద్రగిరి, తిరుపతికి చెందిన క్లాస్ వన్ కాంట్రాక్టర్, మరి కొందరు చోటా మోటా నాయకులు ఇన్నేళ్లు వైఎస్సార్‌సీపీ పంచన బతికి ఇప్పుడు మళ్లీ టీడీపీలోకి చేరిపోయారు. తిరుపతికి చెందిన అన్నా రామచంద్రయాదవ్, రామకృష్ణ, మల్లీశ్వరి మొదట నుంచి టీడీపీలో ఉన్న వారే. ఓట్లు లేకపోయినా సామాజిక వర్గం పేరు చెప్పి ఏ పార్టీ అధికారంలో ఉంటే అందులోకి వెళ్లిపోవడం వారికి సర్వసాధారణం.

మాజీలదీ అదేదారి!

శ్రీకాళహస్తి మాజీ ఎమ్మెల్యే ఎస్సీవీ నాయుడు మొద ట టీడీపీ నాయకుడు. మాజీ మంత్రి బొజ్జల గోపాలకృష్ణారెడ్డికి ముఖ్య అనుచరుడు. ఎమ్మెల్యే కావాలనే ఆశతో నాడు కాంగ్రెస్‌లో చేరి వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రభంజనంలో 2004న శ్రీకాళహస్తి ఎమ్మెల్యేగా గెలుపొందారు. మళ్లీ 2009లో పోటీ చేసినా ఓటమి పాలయ్యారు. 2014లో టీడీపీ నుంచి టికెట్ ఆశించి భంగపడ్డారు. 2019 ఎన్నికల కొద్ది రోజుల ముందు వైఎస్సార్‌సీపీలో చేరారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక పదవి కోసం ఆరాటపడ్డారు. పదవి రాకపోవటంతో తిరిగి సొంత గూటికి చేరిపోయారు.

పక్కా వివరాలతో నివేదికలు



మాట్లాడుతున్న కలెక్టర్ ప్రవీణ్‌కుమార్

తిరుపతి అర్బన్ : ఎన్నికల కమిషన్ నిర్దేశిత ప్రొఫార్మాలో పక్కా వివరాలతో నివేదికలు అందించాలని కలెక్టర్ ప్రవీణ్‌కుమార్ ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లో ఈఆర్‌ఓలు, ఏఈఆర్‌ఓలతో సమీక్షించారు.కలెక్టర్ మాట్లాడుతూ రిటర్నింగ్ అధికారులతోపాటు అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు పూర్తి అవగాహనతో బాధ్యతాయుతంగా ఎన్నికల విధులు నిర్వర్తించాలని సూచించారు. నామినేషన్ వివరాల రోజువారీ నివేదికలు, పోలింగ్ నివేదికలు సకాలంలో పంపాల్సి ఉంటుందని తెలిపారు. స్టాటిక్ సర్వైలెన్స్ టీమ్, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు సీజ్ చేసిన నగదు తదితర వివరాల నివేదికలు, పోలీస్, ఎక్స్‌పెండిచర్ అబ్జర్వర్లు అందించే నివేదికలు ఒకేలా ఉండాలని స్పష్టం చేశారు. సమావేశంలో జేసీ ధ్యానచంద్ర, తిరుపతి కార్పొరేషన్ కమిషనర్ అదితీసింగ్, డీఆర్‌ఓ పెంచల కిషోర్, ఈఆర్‌ఓలు పాల్గొన్నారు.

చెప్పింది చేయడమే జగన్ నైజం

- మాయమాటలు చెప్పడమే చంద్రబాబుకు అలవాటు
- సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా సుపరిపాలన అందించడమే జగన్ లక్ష్యం
- ఎన్నికల ప్రచారంలో మంత్రి పెద్దిరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, పక్కన ఎంపీ రెడ్డెప్ప, జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు

పుంగనూరు: ఎన్నికల్లో చెప్పింది చేయడమే జగన్ నైజమని, నవరత్నాలను అర్హులైన పేదలందరికీ అందించి ఆదర్శ పాలన సాగించారని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి స్పష్టం చేశారు. మండలంలోని ఏతూరు, బండ్లపల్లి, కుమ్మరనత్తం పంచాయతీల్లో శనివారం సిద్ధం ఎన్నికల ప్రచార సభలను ఎంపీ రెడ్డెప్ప, జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులుతో కలిసి నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి పెద్దిరెడ్డి మహిళలు, చిన్న పిల్లలతో ముచ్చటించారు. మంత్రి పెద్దిరెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర చరిత్రలో ప్రజలను ఓట్లు అడిగే అర్హత 100 శాతం హామీలను నెరవేర్చిన ఒక్క వైఎస్సార్‌సీపీకే ఉందని చెప్పారు. చంద్రబాబులాగా గారడీ విద్యలతో ప్రజలను మోసగించడం జగన్‌కు అలవాటు లేదన్నారు. నవరత్న పథకాలను పార్టీలకు, కులమతాలకతీతంగా పేదలకు అందించామని తెలిపారు. సచివాలయం, ఆర్‌బీకే, వైఎస్సార్ విలేజ్ క్లినిక్‌లను నిర్మించి గ్రామాల్లో పరిపాలన వ్యవస్థను పటిష్టంగా ఏర్పాటు చేశారని వివరించారు. గ్రామంలోని ప్రతి 50 ఇళ్లకు ఒక వలంటీర్‌ను నియమించి, వారి ద్వారా సంక్షేమ పథకాలు అందించినట్లు చెప్పారు. సంక్షేమ పథకాలను ఇంటి వద్దకు వచ్చి అందించే కార్యక్రమం దేశ చరిత్రలో ఎక్కడా అమలు చేయలేదన్నారు. అలాంటి గొప్ప వ్యవస్థలను ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల సంక్షేమం కోసం ఏర్పాటు చేశారని కొనియాడారు. ఇలాంటి పథకాలను అమలు చేసేందుకు బయట రాష్ట్రాలకు చెందిన ప్రతినిధులు మన రాష్ట్రంలో పర్యటించి అమలు చేస్తున్న విధానాలను అధ్యయనం చేసుకుని వెళ్లారని తెలిపారు. ఇలాంటి గొప్ప పరిపాలన అందిస్తున్న వైఎస్.జగన్‌మోహన్ రెడ్డి అధికారంలో లేకపోతే సంక్షేమ పథకాలు ఆగిపోతాయని హెచ్చరించారు. సంక్షేమ పథకాలు కొనసాగాలంటే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని రెండోసారి ఎన్నుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని తెలిపారు. మే 13న జరిగే ఎన్నికల్లో రెండు ఓట్లు ఫ్యాన్ గుర్తుపై వేసి ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా పెద్దిరెడ్డి వెంకటమిథున్‌రెడ్డిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని, జగన్‌మోహన్‌రెడ్డిని రెండవ సారి ముఖ్యమంత్రిగా చేసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శులు పెద్దిరెడ్డి, బైరెడ్డిపల్లి కృష్ణమూర్తి, ఎంపీపీ అక్కిసాని భాస్కర్ రెడ్డి, పీకేఎం ఉడా చైర్మన్ వెంకటరెడ్డి యాదవ్, ఏఎంసీ చైర్మన్ అమరనాథరెడ్డి, బోయకొండ ఆలయ చైర్మన్ నాగరాజారెడ్డి, పార్టీ జిల్లా కార్యదర్శి చంద్రారెడ్డి యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి దర్శనానికి 12 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 16 కంపార్ట్‌మెంట్లు నిండాయి. శుక్రవారం అర్ధరాత్రి వరకు 59,621 మంది స్వామివారిని దర్శించుకోగాయ 28,351 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ. 3.45 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ భక్తులకు సకాలంలోనే దర్శనమవుతుండగా.. టిక్కెట్లు లేని భక్తులకు 12 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ టిక్కెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనం లభిస్తోంది.

కోడ్ ఉల్లంఘిస్తే కఠిన చర్యలు



మాట్లాడుతున్న కలెక్టర్ ప్రవీణ్‌కుమార్

తిరుపతి అర్బన్ : ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తే ఎంతటి వారైనా ఉపేక్షించవద్దని, కఠిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ప్రవీణ్‌కుమార్ ఆదేశించారు. శనివారం రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్‌కుమార్ మీనా విజయవాడ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఎన్నికల కోడ్‌తోపాటు పోలింగ్, కౌంటింగ్‌కు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై దిశానిర్దేశం చేశారు. కలెక్టరేట్ నుంచి కలెక్టర్‌తోపాటు జేసీ ధ్యానచంద్ర,ఎస్పీ కృష్ణకాంత్ పటేల్, తిరుపతి కార్పొరేషన్ కమిషనర్ అదితీసింగ్, డీఆర్‌ఓ పెంచల కిషోర్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం కలెక్టర్ జిల్లా అధికారులతో మాట్లాడుతూ ఎన్నికల కోడ్ నిబంధనలు కచ్చితంగా అమలు చేయాలని స్పష్టం చేశారు. రీపోలింగ్, హింసకు తావులేకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలని కోరారు. గంజాయి, లిక్కర్, నగదు అక్రమ రవాణాకు చెక్ పెట్టాలని సూచించారు. చెక్‌పోస్ట్ వ్యవస్థలను మరింత పటిష్టం చేయాలని చెప్పారు. ప్రధానంగా రాష్ట్ర, జిల్లా సరిహద్దు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన చెక్‌పోస్ట్‌లను బలోపేతం చేయాలని ఆదేశించారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు రూ.50వేలకు మించి నగదు కలిగి ఉంటే వెంటనే జప్తు చేయాలని స్పష్టం చేశారు. వ్యాపారులు, సాధారణ పౌరుల విషయంలో ఆచితూచి నిర్ణయాలు తీసుకోవాలని తెలిపారు. వారిని ఇబ్బందులకు గురిచేయకుండా బిల్లులను పరిశీలించి పంపాలని కోరారు. నగదు జప్తు కేసులను 24 గంటల్లో పరిష్కరించాలని వెల్లడించారు. మరోవైపు క్లెయిమ్స్ పెండింగ్ డిస్పోజల్ నాణ్యతతో ఉండాలని రిటర్నింగ్ అధికారులను ఆదేశించారు. లాగిన్‌లను జాగ్రత్తగా బాధ్యతగా సంబంధిత అధికారులు మాత్రమే వినియోగించాలని, ఇతరులతోలాగిన్ వివరాలు పంచుకోకూడదని స్పష్టం చేశారు. సి-విజిల్ ఫిర్యాదులను 100 నిమిషాల్లో పరిష్కరించాలని సూచించారు. కార్యక్రమంలో ఈఆర్‌ఓలు కిరణ్ కుమార్, నిషాంత్ రెడ్డి, రవిశంకర్ రెడ్డి, చంద్రముని, నరసింహులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

పారదర్శకంగా ఎన్నికల నిర్వహణ



మాట్లాడుతున్న కలెక్టర్ ప్రవీణ్‌కుమార్

తిరుపతి అర్బన్ : స్వేచ్ఛాయుత వాతావరణంలో పారదర్శకంగా సార్వత్రి ఎన్నికలు నిర్వహించేందుకు చర్యలు చేపట్టినట్లు కలెక్టర్ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. శనివారం కలెక్టరేట్‌లో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఓటర్లు వందశాతం ఓటు హక్కు వినియోగించునేందుకు సమష్టిగా కృషి చేద్దామని కోరారు. ఎన్నికల గెజిట్ నోటిఫికేషన్ ఈ నెల 18న విడుదలవుతోందని స్పష్టంచేశారు. ఆ రోజు నుంచే నామినేషన్లు ఉంటాయని పేర్కొన్నారు. నామినేషన్‌కు ఈ నెల 25 చివరి తేదీగా వెల్లడించారు. 26న నామినేషన్లు స్క్రూటినీ, 29న ఉప సంహరణ, మే 13న పోలింగ్, జూన్ 4వ తేదీన కౌంటింగ్ ఉంటుందని వివరించారు. ప్రశాంతంగా ఎన్నికల ప్రక్రియ పూర్తి చేసేందుకు అన్ని పార్టీల నేతలు సహకరించాలని కోరారు. నామినేషన్ ప్రక్రియపై రాజకీయ పార్టీల ప్రతినిధులకు రెండవ దఫా అవగాహన కార్యక్రమాన్ని త్వరలో నిర్వహించనున్నామని తెలిపారు. ఏప్రిల్ 1వ తేదీ నాటికి 18 ఏళ్లు నిండిన వారు ఈ నెల 14 లోపు తమ ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకోవచ్చని వెల్లడివంచారు. ఈ నెల 25వ తేదీన తుది ఓటరు జాబితా రూపొందుతుందని తెలిపారు. సమావేశంలో జేసీ ధ్యానచంద్ర, డీఆర్‌ఓ పెంచలకిషోర్, తిరుపతి కార్పొరేషన్ కమిషనర్ అదితీసింగ్, ఈఆర్‌ఓలు కిరణ్ కుమార్, రవి శంకర్ రెడ్డి, నిషాంత్ రెడ్డి, చంద్రముని, నరసింహులు పాల్గొన్నారు.

పదో తరగతి విద్యార్థి హత్య?

- రాళ్లతో కొట్టి చంపినట్టు అనుమానం



భావేష్(ఫైల్)

నాయుడుపేట టౌన్ : పదో తరగతి విద్యార్థి మృతి కలకలం రేపింది. ఎవరో కిరాతకంగా రాళ్లతో కొట్టి చంపేసి ఎవరికీ కనిపించకుండా ప్లాట్ వద్ద రాళ్లతో కప్పేశారు. విన్నమాల గ్రామానికి చెందిన వెంకటయ్య, సుభాషిణి దంపతులకు ఇద్దరు కుమారులు. పెద్ద కుమారుడు భావేష్.. నాయుడుపేట పట్టణంలోని నారాయణ పాఠశాలలో పదో తరగతి చదువుతున్నాడు. పరీక్షలు అయిపోవడంతో ఇంటి వద్దే ఉంటున్నాడు. శుక్రవారం రాత్రి 8 గంటల ప్రాంతంలో భావేష్ ఇంటి నుంచి వెళ్లి తిరిగి శనివారం ఉదయం వరకు కూడా రాకపోవడంతో అతని కోసం కుటుంబ సభ్యులు గాలించినా ఫలితం లేకుండా పోయింది. ఈ నేపథ్యంలో డీఎస్పీ కార్యాలయానికి కొద్ది దూరంలో ఉన్న వెంచర్ వద్ద రాళ్ల కింద భావేష్ మృతదేహం బయటపడింది. డీఎస్పీ శ్రీనివాసరెడ్డి, ఎస్‌ఐ గోపి.. ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. విద్యార్థిని రాళ్లతో కొట్టినట్టు ఆనవాళ్లు కనిపించాయి. అయితే పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గడప గడపలో సంక్షేమ వెలుగులు

- బాబు ఎన్ని పొత్తులతో వచ్చినా జయం మనదే
- జగనన్న పథకాలకు విశేష ఆదరణ
- అభినయ్ నేతృత్వంలో తిరుపతి అభివృద్ధి
- టీటీడీ చైర్మన్, ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి



ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి, మేయర్ శిరీష



ప్రజలకు అభివాదం చేస్తున్న టీటీడీ చైర్మన్, ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి

తిరుపతి మంగళం : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసిన పథకాలకు విశేష ఆదరణ లభిస్తోందని, గడప గడపలో సంక్షేమ వెలుగులు నిండాయని టీటీడీ బోర్డు చైర్మన్, ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి తెలిపారు. శనివారం నగరంలోని 33, 35వ డివిజన్లతో ఎన్నికల ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా భూమనకు ప్రజలు అపూర్వ స్వాగతం పలికారు. మేడలపై నుంచి పూలవర్షం కురిపించారు. జై జగన్ నినాదాలతో మద్దతు పలికారు. భూమన మాట్లాడుతూ చంద్రబాబు ఎన్ని పొత్తులతో వచ్చిన జయం వైఎస్సార్‌సీపీదే అని స్పష్టం చేశారు.

14ఏళ్లపాటు ముఖ్యమంత్రిగా పనిచేసిన చంద్రబాబుకు ప్రజలను మోసగించడం తప్ప చిన్నపాటి కూడా చేయలేదని తెలిపారు. ఎన్నికలు వచ్చినప్పుడు నోటికి వచ్చిన హామీలు ఇవ్వడం, తర్వాత వాటిని తుంగలో తొక్కడం ఆయన నైజమన్నారు. ప్రతి నెలా ఇంటి వద్దకే వస్తున్న పింఛన్లను అడ్డుకున్న దుర్మార్గుడని విమర్శించారు. చంద్రబాబు నీచ రాజకీయాలకు వృద్ధులు ఇబ్బంది పడ్డారని, మండుటెండలో సచివాలయాలకు వెళ్లి పింఛన్ తీసుకోవాల్సిన దుస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈక్రమంలో అనేక మంది వృద్ధులు మృత్యువాత పడ్డారని, ఇందుకు చంద్రబాబే కారణమని మండిపడ్డారు. సింగిల్‌గా పోటీ చేసే ధైర్యం లేక, ప్రజల్లోకి వచ్చి ముఖం చూపించలేక జనసేన, బీజేపీల పొత్తుతో వస్తున్నారని ఆరోపించారు. ప్రజలకు మంచి చేశారు కాబట్టే జగనన్న సింగిల్‌గానే ఎన్నికల్లో పోటీ చేస్తున్నారని వెల్లడించారు. 14 ఏళ్లలో చంద్రబాబు చేయలేని, అందించలేని సంక్షేమ పథకాలు, అభివృద్ధిని నాలుగున్నరేళ్లలోనే చేసి చూపిన సమర్థుడు జగనన్న అని కొనియాడారు. అలాంటి నాయకుడిని తిరిగి గెలిపించుకుంటే సంక్షేమం ప్రజల వెంటే ఉంటుందని వివరించారు.

ఎన్నడూ లేనంత అభివృద్ధి

గత 40ఏళ్లలో ఎన్నడూ లేనంతగా తిరుపతిని అభివృద్ధి చేసిన భూమన అభినయ్‌రెడ్డి చూస్తే గర్వంగా ఉంటుందని ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి తెలిపారు. తిరుపతి అభివృద్ధే లక్ష్యంగా అహర్నిశలు శ్రమించాడని చెప్పారు. 22మాస్టర్‌ప్లాన్ రోడ్లను ఏకకాలంలో నిర్మించడమంటే సామాన్యమైన విషయం కాదన్నారు. అభివృద్ధి చేసేటప్పుడు ఎలాంటి ఒత్తిళ్లకు తలొగ్గకుండా, ఓట్ల గురించి ఆలోచించకుండా చిత్తశుద్ధితో పనిచేశాడని వెల్లడించారు. అభియన్ తపన వల్లే తిరుపతి రూపురేఖలు మారిపోయాయని తెలిపారు. అందుకే ప్రజలు తమ గుండెల్లో అభినయ్‌ని పెట్టుకుని ఆదరిస్తున్నారన్నారు. ఓటు కోసం ఏ గడపకు వెళ్లినా ఎంతో ఆప్యాయంగా ఆహ్వానిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో మేయర్ శిరీష, డిప్యూటీ మేయర్ ముద్రనారాయణ, పార్టీ సీనియర్ నాయకులు దొడ్డారెడ్డి సిద్ధారెడ్డి, దుద్దేల బాబు, దేవదానం, పార్టీ 33వ డివిజన్ అధ్యక్షుడు దినేష్ రాయల్, కార్పొరేటర్ దూది కుమారి, దూది శివరాయల్, కార్పొరేటర్ రామస్వామి వెంకటేశ్వర్లు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నైనారు మధుబాల, పార్టీ నాయకులు మార్కెట్ మునిరామిరెడ్డి, చందురాయల్, రాఘవులు నాయుడు, వై.సురేష్, బాలిశెట్టి కిషోర్, తిరుమల చిన్నముని, కంకణాల రమేష్, తాళ్లూరి ప్రసాద్, శరత్ యాదవ్, ఎస్‌కే నాయుడు, కిషోర్‌రెడ్డి, మల్లికార్జున, నారాయణబాబు, మాధురి, మునిలక్ష్మి, గీతాయాదవ్, శారద పాల్గొన్నారు.

అభివృద్ధిని ఆశీర్వదించండి




మాధవమాల గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎంపీ గురుమూర్తి

ఏర్పేడు : వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అమలు చేసిన సంక్షేమ, అభివృద్ధి పథకాలను గుర్తించి ఆశీర్వదించాలని ఎంపీ గురుమూర్తి తెలిపారు. శనివారం మండలంలోని మాధవమాల, పాతవీరాపురం, ఇసుకతాగేలిలో నిర్వహించిన ఆత్మీయ సమావేశాల్లో ఆయన పాల్గొన్నారు. ఎంపీ మాట్లాడుతూ ఐదేళ్లపాటు జగనన్న జనరంజకంగా పాలించారన్నారు. అన్నివర్గాలకు సమన్యాయం చేశారని చెప్పారు. కుల, మత, రాజకీయాలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించారని వెల్లడించారు. ఎన్నికలు వస్తేనే ప్రతి పక్షాలకు ప్రజలు గుర్తుకు వస్తారని, గుండెల్లో కత్తులు పెట్టుకుని, పైకి పొత్తు పెట్టుకుంటూ మాయ మాటలు చెప్పే ప్రయత్నం చేస్తారని ఆరోపించారు. ప్రజలు ఏది నిజమో ఏది అబద్ధమో గ్రహించి తీర్పు ఇవ్వాలని కోరారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ ముందుకు సాగుతున్నారని వివరించారు. వైఎస్సార్‌సీపీతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని స్పష్టం చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల ఇన్‌చార్జి గున్నేరి కిషోర్‌రెడ్డి, వైస్ ఎంపీపీ జనార్ధన్‌రెడ్డి, సర్పంచ్‌లు బల్కిస్ బేగం, మంజుల, గురవమ్మ, ఎంపీటీసీ సభ్యుడు భరత్‌కుమార్, కో–ఆప్షన్ సభ్యుడు బత్తిశెట్టి, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు రమణయ్య యాదవ్, మాజీ అధ్యక్షుడు గురవారెడ్డి, పార్టీ మండల ప్రధాన కార్యదర్శి సయ్యద్ కరీముల్లా, ఎంపీటీసీ మాజీ సభ్యుడు మునిరత్నం రెడ్డి, నాయకులు పెరుమాళ్ ఆచారి, రాజశేఖర్‌రెడ్డి, శంకరయ్య, రాజులుపాళెం రమేష్ చెంగల్‌రాయులు పాల్గొన్నారు.

నక్కలవంక వాగులోకి ప్రమాదకర రసాయన వ్యర్థాలు

- చెన్నై నుంచి లారీలో తీసుకొచ్చి వదులుతుండగా పట్టుకున్న కల్లూరువాసులు
- ఇప్పటికే కర్మాగార వ్యర్థాలతో కలుపితమైన నక్కలవంక వాగు
- పట్టించుకోని కాలుష్యనియంత్రణ మండలి అధికారులు



పోలీసులు సీజ్ చేసిన హైడ్రోక్లోరిక్ యాసిడ్ లోడ్ చేసిన ట్యాంకర్

రేణిగుంట: ఆ వాగు కొన్ని గ్రామాల పాలిట విష పుటేరు.. ఓ పక్క ఫ్యాక్టరీ రసాయన కలుషిత వ్యర్థాలను ఆ వాగులో వదులుతూ కొన్ని గ్రామాలను విషతుల్యం చేస్తుండగా, ఇది చాలదన్నట్లు బయట ప్రాంతాల నుంచి అత్యంత ప్రమాదకర రసాయన వ్యర్థాలను ట్యాంకర్లలో తీసుకొచ్చి వదులుతున్నారు. దశాబ్దాలుగా ఆరోగ్యాలతో చెలగాటమాడుతున్న పరిస్థితి సవాలుగానే మారింది. రేణిగుంట మండలం గాజులమండ్యం ఇండస్ట్రియల్ ఎస్టేట్ సమీపంలో ప్రవహిస్తున్న నక్కల వంకవాగులో తాజాగా శుక్రవారం అర్ధరాత్రి ఓ ట్యాంకర్‌ను తీసుకొచ్చి రసాయన వ్యర్థాలను వదులుతుండగా, సమీపంలోని కల్లూరు గ్రామస్తులు పట్టుకుని మండలంలోని గాజులమండ్యం పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు. తూర్పుగోదావరి జిల్లా బలభద్రపురంలోని గ్రాసిమ్ ఇండస్ట్రీస్ నుంచి తమిళనాడు రాష్ట్రం చెన్నై గ్లోబో ఇంటర్నేషనల్ కంపెనీకి హైడ్రోక్లోరిక్ యాసిడ్‌ను ఈ ట్యాంకులో సరఫరా చేస్తున్నారు. శుక్రవారం అర్ధరాత్రి గాజులమండ్యం ఇండస్ట్రియల్ ఎస్టేట్ సమీపానికి వచ్చాక అందులోని ప్రమాదకర రసాయన వ్యర్థాలను ట్యాంకర్ డ్రైవర్ ఈ వాగునీటిలో వదిలాడు. అయితే వాగు వడమాలపేట మండలం కల్లూరు గ్రామ శివారున ఉండడంతో గ్రామస్తులు కొందరికి అనుమానం వచ్చి అక్కడికి చేరుకున్నారు. ట్యాంకర్ డ్రైవర్‌ను ప్రశ్నించారు. వెంటనే ట్యాంకర్‌ను తీసుకుని పరారీ అయ్యేందుకు డ్రైవర్ యత్నించగా, గ్రామస్తులు పట్టుకుని గాజులమండ్యం పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు. దీనిపై సీఐ సుబ్బరాయుడు మాట్లాడుతూ ట్యాంకర్‌ను కాలుష్య నియంత్రణ మండలి అధికారులకు అప్పగించి, కేసు దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

జీవన మనుగడే ప్రశ్నార్థకం

గ్రామస్తులు మాట్లాడుతూ గతంలో కూడా ఇలాంటి రసాయన వ్యర్థాలను బయటి ప్రాంతాల వారు రెండు, మూడు దఫాలు రాత్రివేళల్లో తీసుకొచ్చి వదిలి వెళ్లారని వివరించారు. నక్కల వాగు నీటిలో ఇప్పటికే గాజులమండ్యం కెమికల్ కర్మాగారాల నుంచి విచ్చలవిడిగా వ్యర్థాలను వదులుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని వాపోయారు. దశాబ్దాల తరబడి పంటపొలాలు, భూగర్భ జలాలు విషతుల్యమై జీవన మనుగడ ప్రశ్నార్థకమవుతోందని ఆందోళన చెందారు. దీనివల్ల కల్లూరు, చెన్నంపల్లి, పెన్నగడం, పెనుమల్లం, జీపాళెం మరో పది గ్రామాల్లో భూగర్భజలాలు పూర్తిగా కలుషితమయ్యాయని ఆవేదన చెందారు. గతంలో అనేక మార్లు ఫిర్యాదులు చేసినా అధికారులు పట్టించుకోలేదని, దీంతో ఇక్కడ ఫ్యాక్టరీలే కాకుండా బయట ప్రాంతాల నుంచి కూడా వచ్చి కలుషిత వ్యర్థాలను వదులుతున్నారని తెలిపారు. ఇప్పటికైనా అధికారులు పటిష్టమైన చర్యలు తీసుకోవాలని, లేదంటే ఆందోళన తప్పదని హెచ్చరించారు.

వైఎస్సార్‌సీపీలోకి వలసల వెల్లువ



నేతలకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి

శ్రీకాళహస్తి : పట్టణంలోని 200 మంది టీడీపీ నేతలు, కార్యకర్తలు, సానుభూతిపరులు వైఎస్సార్‌సీపీలో చేరారు. శనివారం స్థానిక కైకాలవారి సత్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారికి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారు మాట్లాడుతూ పేదల అభ్యున్నతి కోసం వలంటీర్ల ద్వారా విశేషంగా సంక్షేమ పథకాలు అందించిన జగనన్న పాలనకు ఆకర్షితులమై వైఎస్సార్‌సీపీలోకి వచ్చినట్లు వెల్లడించారు. శ్రీకాళహస్తిలో ఏ ఎమ్మెల్యే కూడా ప్రజలకు అందుబాటులో ఉండేవారు కాదని, మధుసూదన్‌రెడ్డి మాత్రం నిత్యం అందరినీ కలుస్తూ సమస్యలు తీరుస్తుంటారని వివరించారు. అలాంటి నాయకుడు దొరకడం శ్రీకాళహస్తి ప్రజల అదృష్టమని తెలిపారు. రాబోయే ఎన్నికల్లో మధుసూదన్‌రెడ్డిని అత్యధిక మెజారిటీతో గెలిపించుకునేందుకు చిత్తశుద్ధితో పనిచేస్తామని స్పష్టం చేశారు. పార్టీలో చేరిన వారిలో గరికపాటి చంద్రశేఖర్‌బాబు, పోలస్వామి స్వర్ణమూర్తి, శేషంశెట్టి ప్రభాకర్, అఫ్రీన్, కరిష్మా, లలితమ్మ, సుబ్బమ్మ, శాంతమ్మ, లక్ష్మి, సరసు, జ్యోతి, సంధ్య జహీరా, వేదవతి, సహదారి, రుక్మిణి ఉన్నారు. కార్యక్రమంలో శ్రీకాళహస్తీశ్వరాలయ కమిటీ చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, ఆర్టీసీ వైస్ చైర్మన్ మిద్దెల హరి, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు పగడాల రాజు, నాయకులు కంఠా ఉదయ్, చిట్టివేలు జయగోపాల్, ఉత్తరాజి శరవణకుమార్, సెన్నీరు కుప్పం శేఖర్, నాగరాజు, మొగరాల గణేష్, వెంకటేష్‌బాబు, కొట్టే సురేష్, పాండు, అస్లాం, సాగి రాబీ, షర్మిలాతాగూర్, అమర్, పూడి రవి, సత్య, కార్తికేయన్, పత్తి మణి పాల్గొన్నారు.